# సరము

శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

श्रीनिवासो विजयते

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 21

# సరమ

రచన

**శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు**

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య**

ప్రచురణ

**డాక్టర్ ఐ.వి.సుబ్బారావు,** ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 21

**SARAMA**

by

***Sri Kamisetty Srinivasulu***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Lasertypeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన! ఎంతటి ధార్మిక చేతన!'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**

వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ

❀ ❀ ❀

# మనవి

వేద కథాభారతి.


అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన స్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య





# సరమ

వేదం మన జాతి సంపద. వేదమంటే విజ్ఞానమని తాత్పర్యం. వేదం కేవలమొక పుస్తకం కాదు. అదొక సంప్రదాయం. అది సజీవమైనది. మన జాతిని, సంస్కృతిని కొన్నివేల సంవత్సరాలుగ ఉత్తేజపరచినది. ఇది మౌఖికంగ మన కందివ్వబడిన 'శ్రుతి'. గురుశిష్యపరంపరగ మనము పొందిన 'అనుశ్రవము'. భక్తిప్రపత్తులతో అధ్యయనం చేసి ఉన్నత స్థానంలో మనం నిలుపుకున్న 'ఆమ్నాయము'. సంప్రదాయసుందరమైన 'ఆగమము'. బాగా యోచించి అనుభవించవలసిన 'స్వాధ్యాయము' వేదవాఙ్మయం క్షీరసాగరం వంటిది.

**వేదాలు నిత్యసత్యాలు :**

లోకధర్మం, నీతి, న్యాయం, సాంఘికప్రయోజనం వీనితో బాటు ధర్మధ్వనిని వినిపించే నిత్యసత్యాలు వైదిక ఇతిహాసాలు. ఋగ్వేద కథలు మానవత్వపు విలువలను ఆవిష్కరిస్తాయి. అవి వైవిధ్యంతోబాటు భావసంపదను నింపుకొన్నవి. అందలి పాత్రలు, సన్నివేశాలు మానవత్వానికి సన్నిహితాలు. దేవాసురయుద్ధాలలో మానవుల పాత్ర ఎంతో ఉంది. దేవతాప్రీత్యర్థం మనుష్యులు యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తారు. దేవతలు తమ అనుగ్రహాన్ని ప్రసాదిస్తారు. ఇంద్రుడు, అశ్వినులు తమ దయాదాక్షిణ్యాలను మానవులపై నెరపిన సన్నివేశాలు ఈ వేదగాథలలో కనిపిస్తాయి. వైదికఇతిహాసాలు సంపన్నమైనవి.

అర్థవంతమైనవి. బంగారు గనులవంటి భావనిధిని వేదఋషులు త్రవ్వి వెలికి తీసినారు. ఆదర్శవంతంగ మలచి మానవాభ్యున్నతికి దివ్యనీరాజనాలర్పించినారు.

**సరమ విశ్వసనీయ :**

సరమ కథ సత్యానికి, ఋజుత్వానికి తార్కాణం. ఈ కథలో తారసిల్లే ఇంద్రుడు, బృహస్పతి, అంగిరసులు, గోగణం, పణులు మొదలైన పాత్రలు; కొండలు, గుహలు, నదులు ఆయా సన్నివేశాలు బోధించే తాత్త్వికదృక్పథమేమైనా సరమ దేవకార్యాన్ని సాధించి పొందినవరం మానవజాతికే అనుగ్రహప్రసాదమైనది. ప్రాయశః 'సరమ' ఒకానొక జీవసంతతికే మాతృస్థానం వహించినది.

ఋగ్వేదం సరమను ఇంద్రుని దూతగ పేర్కొంటుంది. ఈమెను 'దేవశుని'గ యాస్కుడు వ్యవహరిస్తాడు. వీరిని అనుసరించి సరమను శునకాలకు తల్లిగ వైదికవ్యాఖ్యాతలు కొందరు పేర్కొంటారు. బృహద్దేవత సరమకథను విలక్షణంగ చెబుతుంది. పణులనే అసురులు గోవులను అపహరించి దాచిపెట్టారు. వానిని కనుక్కోవడానికి ఇంద్రుడు సరమను నియోగిస్తాడు. సరమ 'రస' అనే నదిని దాటి వాని జాడ తెలుసు కొంటుంది. పణుల మాయాజాలంలో చిక్కి సరమ వాళ్లు అందించిన పాలను త్రాగుతుంది. ఇంద్రుని వద్దకు తిరిగి వెళ్లిన సరమ గోవుల గురించి కాని పణుల గురించిగాని తనకు తెలియదంటుంది. ఇంద్రుడు సరమను కాలితో తంతాడు. పాలు కక్కుతూ సరమ పరుగెత్తుతుంది. ఇంద్రుడు సరమను వెంబడించి పణులను తరిమి గోవులను కైవశం చేసుకొంటాడు.

బృహద్దేవత వినిపించే ఈ కథ సరమను విశ్వాసఘాతకురాలుగ చిత్రిస్తుంది.

జైమినీయ బ్రాహ్మణం మరొక కథను తెలుపుతుంది. సాయణుని భాష్యాన్ని అనుసరిస్తూ, సాత్యాయనకుడు దీనినే అంగీకరిస్తాడు. గోవులను వెదకడానికి ఇంద్రుడు తొలుత సుపర్ణుని వినియోగిస్తాడు. సుపర్ణుడు అవిశ్వాసాన్ని ప్రకటిస్తాడు. ఇంద్రుడు సుపర్ణుని శపిస్తాడు. సరమను తన దూతగ పంపుతాడు. సరమ విశ్వాసపూర్వకంగ కార్యాన్ని సాధిస్తుంది. సరమ కిచ్చిన మాటమేరకు గోక్షీరాన్ని ఆహారంగ అనుగ్రహిస్తాడు.

**సరమతత్త్వం విచిత్రమైంది :**

సరమ ఉషస్సు. గోవులు సూర్యకిరణాలు. వీనిని చీకటి దొంగిలించినది. రేయి కప్పి కనుమరుగుచేసినది. దేవతలు, మానవులు వానికోసం నిరీక్షించినారు. వీనిని కనుక్కోవడం కష్టమైంది. చీకటి కప్పి అవి ఆకాశపుటంచులలో చెల్లాచెదరైనవి. సరమ ఋజువుగ ముందుకు సాగినది. సత్యశోధనతో కనుగొన్నది. మరలివచ్చిన సరమను వెంబడించి ఇంద్రుడు అంధకారాన్ని ఛేదించి వానిని ప్రకృతిపూజారులకు అందజేసినాడు. జ్యోతిని, జీవనాన్ని, జవసత్త్వాలను ఇంద్రుడు ప్రసాదించినాడు. సరమకథకు తత్త్వవేత్తలు చేసిన వ్యాఖ్యానమిది.

వేదంలోని సజీవపాత్రలను మెరిసే తారకలుగ, ప్రకృతి ప్రతీకలుగ భావించడం, నిరూపించడం మేధావులకు సహజం. వానిని కాదనే అధికారం లేదు. అయితే సామాన్యుల దృష్టికి అవి యథార్థచరిత్రలు.

బోధనాత్మకమైనవి. మానవత్వపు విలువలను నింపుకొన్న ప్రాబోధకస్తవాలు. వైదిక నాయకుల సాహసకృత్యాలు బహుధా కీర్తింపబడినవి. అవి సరళగంభీరశైలిలో అందరి జ్ఞాపకాలలో నిలిచినవి. యజ్ఞయాగాది క్రతువులు పెరిగినవి. కాలక్రమేణ అవగాహనలో శైథిల్యమేర్పడినది. యాథాతథ్యాన్ని నిర్ణయించడం కష్టమైంది. భిన్నవిభిన్న వ్యాఖ్యానాలు ఏర్పడినవి.

వాజసనేయసంహిత సరమను వాక్కుతో పోల్చినది. తైత్తిరీయ ఆరణ్యకం సరమను ఒక పవిత్రవేదిగ భావించినది. అథర్వవేదంలో కూడ సరమ ప్రస్తావన ఉంది. ఋషభోత్సర్గ సన్నివేశంలో ఎద్దును దానమిచ్చే చోట ఈ సరమను అధిదేవతగ ఆహ్వానిస్తుంది. సరమను ఒక క్షుద్రదేవతగ, పిల్లలను కుక్కదగ్గు నుండి కాపాడే శక్తిగ కూడ ఆ వేదం పేర్కొంటుంది. సరమ ఒక మనుష్యగ్రహం. స్త్రీల గర్భవిచ్ఛిత్తికి ఒక కారణంగ కూడ పేర్కొనబడింది.

**ఆమె నిత్యసత్యాన్వేషిణి :**

కాలానుక్రమంలో సరమకథ మానవీకరణను పొందినది. ఆమె శీలము అకుంఠితము. ఆమె ప్రవర్తన మాననీయము. ఆమె హృదయము ప్రణయనిర్భరము. తన సంతతిని ప్రాణసమానంగ భావిస్తుంది. కద్రువ నాగమాతగ, వినత గద్దలకు తల్లిగ ప్రసిద్ధిని పొందినట్లు సరమ సారమేయాలకు తల్లిగ పేర్కొనబడింది. యముని వేటకుక్కలైన శ్యామ, శబలలకు తల్లిగా కూడ వినుతికెక్కినది.

వరాహపురాణం సరమకథలో పణులతో బాటు విద్యుత్, సువిద్యుత్ అనే మరుత్తులను ప్రవేశపెడుతుంది. ఇంద్రుడు సరమకు రక్షగ ఈ మరుత్తులను నియోగించి సరమ మాయను తొలగించి గోవులను కైవశం చేసుకొంటాడు.

సత్యప్రవాహంతో కూడిన సరస్వతి వంటిది సరమ. ఇడాదేవికి సమానమైన సరమ నిత్యసత్యాన్వేషిణి- మానవులపాలిటి దివ్యగురువు. పణుల పిరికితనాన్ని, సరమ విశ్వాసాన్ని తెలిపే కవిత ఋగ్వేదానికే గొప్ప అలంకారమంటాడు ఒక పాశ్చాత్యపండితుడు. ఈ విశాలవిశ్వంలో సరమ ఉషోదయరేఖలు వ్యాపించినవి. సరమకథ వన్నెలు చిన్నెలు దిద్దుకొని ఋగ్వేదకథాసాగరంలో అనర్ఘరత్నంగ భాసిస్తుంది. ఈ సరమ ఇతివృత్తాన్ని సంవాదసూక్తంగ కూడ పేర్కొంటారు.

**దేవకార్యాన్ని నిర్వహించగలను :**

ఇంద్రుడు లోకపాలకుడు. వృత్రాసురుడనే లోకకంటకుడైన రాక్షసుని సంహరించినవాడు. గోసంపదను కాపాడడం అతని ప్రధానకర్తవ్యం.

గోవులను రక్షించే బాధ్యత ఏడుగురు అంగిరసులది. ఈ ఏడుగురు ఋత్విజులు ఏమరక వీనిని కాపాడుతారు. చక్కని స్వరాలతో వీరు స్తోత్రపాఠాలను నిర్వహిస్తారు. వీరికి సంబంధించిన వాడే బృహస్పతి. బృహస్పతి బుద్ధికి మారుపేరు.

పణులు అసురప్రవృత్తితో దేవతలకు చీకాకు కలిగిస్తారు. నీతి

నియమాలు లేని తిరుగుబోతు జాతిగ వాళ్లను వ్యవహరిస్తారు. పణులు దొంగతనాలకు, దొంగ వ్యాపారాలకు పెట్టినది పేరు. పణుల ప్రధానవృత్తి ఆవులను దొంగిలించి అక్రమంగ ధనమార్జించడం. అంగిరసులకు పణులకు తరచు యుద్ధాలు సంభవిస్తాయి. ఈ యుద్ధాలలో అందమైన పణులస్త్రీలను అంగిరసులు బందీలుగ కూడ చేసినట్లున్నది.

సరమ ఇంద్రుని కొలువులో ఉన్న ఒకానొక దేవత. యౌవనవతి. సౌందర్యరాశి. తన ఋజుప్రవర్తనతో, సత్యనిష్ఠతో ఇంద్రుని విశ్వాసాన్ని చూరగొన్నది. శక్తి యుక్తులతో కార్యదీక్షను కార్యసిద్ధిని నిర్వహించకలిగిన ప్రతిభాశాలి. పేరు ప్రతిష్ఠలు కలిగిన ఇంద్రదూతికగ సరమను కీర్తిస్తారు.

అసురులైన పణులు దేవతల అనంత గోసంపదను అపహరించినారు. వారి మాయోపాయములకు అంతులేదు. ఆ అపార గోగణాన్ని ఎక్కడ దాచిపెట్టినది అంగిరసులు తెలుసుకోలేక పోయినారు. గోవులను దాచిన చోటును కనుగొని వానిని పొందడానికి ప్రయత్నం చేసినారు. గొప్ప యజ్ఞం నిర్వహించినారు. గోసంపదను తమకు సంప్రాప్తం చేయగలిగినవాడు ఇంద్రుడొక్కడే. స్తోత్రపాఠాలతో ఇంద్రుని ఆహ్వానించినారు. అంగిరసుల స్తుతులకు అలరిన ఇంద్రుడు వారి ప్రార్థనను మన్నించినాడు.

పణుల వృత్తిని ప్రవృత్తిని తెలిసిన ఇంద్రుడు ఇది వారిపనే అని నిశ్చయించినాడు. గోవులున్న వైనం తెలుసుకుంటే పణులను నిర్జించడం కష్టం కాదని ఇంద్రునికి తెలుసు. దుర్బుద్ధులు, నీతిబాహ్యులు అయిన

ఆ వంచకులను తెలివిగ సాధించాలని పథకం వేసినాడు. ఇంద్రుని మదిలో సరమ మెదలినది. ఈ బృహత్తరమైన కార్యం సాధించడానికి ఒక్క సరమకే సాధ్యమౌతుంది.

సరమ ఇంద్రుని పిలుపు నందుకొన్నది. దేవకార్యం నిర్వహించడం సరమకభీష్టమైనదే.

*'సరమా! నీతో మాకు పనిపడింది. పణుల విషయం నీకు తెలియనిది కాదు. నీ తెలివితేటలు నీ ఋజుప్రవర్తన, సత్యవాక్యపరిపాలన లోకవిదితాలు'*

ఇంద్రుని వచనాలకు సరమ ప్రీతిని పొందినది. దేవకార్యాన్ని తెలపమన్నది.

*''పణులు మన గోసంపదను అపహరించినారు. ఆ నయవంచకులు వానిని అప్రభేద్యమైన చోట దాచిపెట్టారు. నీవు గోవుల జాడ తెలుసుకొని పణులను హెచ్చరించు. మన గోధనాన్ని మనకు అప్పగించకపోతే పర్యవసానం అనుభవిస్తారని కూడ తెలుపు. కార్యసాధనకు మారు రూపమైన నీకు ఇంతకంటె నేను చెప్పేది లేదు!''*

ఇంద్రుని ఆజ్ఞను శిరసావహించిన సరమ అంటున్నది,

*''మీ కార్యానికి నేను వెంటనే పూనుకుంటాను. మీ అనుగ్రహం వల్ల ఈ దేవకార్యాన్ని నేను సాధించగలననే విశ్వాసమున్నది. ఈ పవిత్రమైన కార్యాన్ని సాధించగలిగితే నాకు ఒక వరాన్ని అనుగ్రహించండి.''*

ఇంద్రునికి సరమ నిష్ఠాగరిష్ఠత తెలుసు. సౌశీల్యవతియైన సరమ తన కోరికను తెలిపినది.

*''నాకు నా సంతతికి గోవులక్షీరాన్ని ఆహారంగ అనుగ్రహించు''*

అన్నది. వేదమూర్తి ఇంద్రుడు అంగీకరించినాడు.

సరమ బయలుదేరినది. అంగిరసులు ఆశీస్సులనందించినారు. సరమకు తెలుసు ఇది సామాన్యమైన పనికాదని. ఉత్తుంగగిరిశిఖరాలను అధిగమించవలె. ఎన్నో నదీనదాలను దాటవలె. పణులతో పని తేలికకాదు. వాళ్లు నయవంచకులు. కృతఘ్నులు. దుర్మార్గపథవర్తనులు. తమ పనులు సాధించుకోవటానికి ఎంత అఘాయిత్యానికైన ఒడిగట్టగలరు. సరమ అసాధ్యమైన పనిని సాధించడానికి పూనుకొన్నది. తాను కష్టాలను నష్టాలను భరించడానికి సిద్ధమైనది. తన సంతతికి మంచి జరగవలె. ఇది సరమ వజ్రసంకల్పం. మార్గం శుద్ధమైతే ఫలం తప్పక సిద్ధిస్తుందనే ఆత్మవిశ్వాసం ఉన్నది. ఆర్జవత్వానికి పేరు మోసిన సరమ వివేకం, వివేచన కార్యసిద్ధికి సోపానాలు.

**అన్వేషణ ఫలించింది :**

పణులు సామాన్యులు కారు. దొంగిలించిన గోవులను అప్రభేద్యమైన చోట దాచిపెట్టినారు. అగాధమైన నదులవెనుక, ఎత్తైన కొండల మధ్య, అంధకారబంధురమైన గుహలలో వానిని దాచిపెట్టినారు. వలుడనే రాక్షసుని వానికి రక్షగ నిలిపినారు. అంతులేని విశ్వాసంతో అహంకారంతో విర్రవీగే పణులు- ఆత్మవిశ్వాసానికి, ఆర్జవానికి,

సామర్థ్యానికి సత్యశోధనకు పేరుపొందిన సరమ ఇంద్రుని దూతగ వస్తుందని, తమ రహస్యాన్ని ఛేదించగలుగుతుందని కలలో కూడ ఊహించలేకపోయారు. తామసికప్రవృత్తితో విగ్రహీగే జీవునికిగాని దేవునిక గాని వినాశం తప్పదు. అసురప్రవృత్తివల్ల తాత్కాలికమైన సుఖభోగాలను అనుభవించవచ్చు. కాని అంతిమ విజయము ధర్మానిదే. దైవీసంపదను పెంచుకొన్న శక్తిని ఏదుష్టశక్తులు నిరోధించలేవు. సకలప్రాణికోటికి జీవభిక్షను అందించే గోమాతలను బంధించి చీకటికోణాలలో పడవేసి పణులు తమ పాశవికప్రవృత్తిని చాటుకొన్నారు. వైదికధర్మతేజం అజేయమైనది. అవక్రమమైనది. దీనికి పరిపూర్ణమైన ప్రాతినిధ్యాన్ని వహించేది సరమ.

పణుల కోసం, పశువుల కోసం అన్వేషిస్తున్న సరమకు 'రస' అనే పెద్ద నది అడ్డంగ నిలిచింది. మహాసముద్రం వంటి సింధూనదికి ఈ 'రస' ఉపనది. ఉత్తుంగ తరంగాలతో, అగాధమైన జలాలతో దాటడానికి అశక్యంగ ఉన్న 'రస'ను సరమ చూసినది. ఈ నదిని అధిగమించడానికి సరమకున్న శక్తి ఒక్కటే ఆర్జవం. మొక్కవోని గాంభీర్యంతో, అచంచలవిశ్వాసంతో 'రస' జలాలను దాటగలిగింది సరమ. కార్యసాధనకు, కార్యశూరులు చేయగలిగినదే సరమ కూడ నిర్వహించినది. రసానదీమతల్లి సరమకు స్వాగతం పలికింది. సరమ ఆవలిగట్టు చేరుకుంది.

సరమ ఎట్టెదుట ఉత్తుంగగిరులు నిలిచినవి. రసాతలాన్ని అధిగమించిన సరమకు గిరిశిఖరాలు ఎంతపాటి. గిరులను

అధిరోహించినది. ఝురులను లంఘించినది. గుహాంతర్భాగాలను గాలించినది. పశుగణాన్ని పసిగట్టినది. సరమ పణులను చూసినది. పణులు సరమను చూసినారు. అవాక్కై నిలిచిన పణులను సరమ నిలదీసినది. పణులు తేరుకొని సరమతో సామదానాలు సాగించినారు. ఇంద్రాదులు తెలుసుకోలేని తమ ఉనికిని కనుగొన్న సరమస్వరూపం వాళ్లకవగతమైనది. అప్రభేద్యమైన రసాతల శిలాతలాలను ఛేదించుకొని ప్రత్యక్షమైన సరమ శక్తిసామర్థ్యాలను బేరీజు వేయగలిగినారు. ఆ సరమా పణుల మధ్య సాగిన సంవాదమొక మహత్తర సూక్తమై వెలసినది.

*'సరమా! ఇంతదూరం ఇన్ని కష్టాలకోర్చి ఎందుకు వచ్చినావు? ఆశ్చర్యంగా ఉంది. ఏమి పనిగట్టుకొని రావలసి వచ్చింది. ఈ ప్రాంతాలలో తిరగడం అంతమంచిది కాదు. 'రస' నదీజలాలను ఎట్లా దాటగలిగినావు. అసామాన్యమైన ఈ కార్యాన్ని ఎట్లా నిర్వహించగలిగినావు. ఇక్కడ రాళ్లు రప్పలు తప్ప ఇంకేమి లేవు. నీకు కావలసినవి ఏమిటో చెప్పు. నిన్ను చూస్తే జాలివేస్తుంది'*

పణుల మాటలు మెత్తగ ఉన్నా, మనసులో బెదురు కనిపిస్తున్నది. పణులకు తెలుసు సరమ తత్త్వం; ఆమె చెక్కుచెదరని మనస్తత్త్వం. సరమ నోటివెంట వేదబుక్కులవంటి వాక్యాలు వెలువడినవి.

*''నేను ఇంద్రుని దూతగ వచ్చినాను. మీరు చేసిన చౌర్యం క్షమింపరానిది. దైవీసంపదయైన గోగణాన్ని తస్కరించినారు.*

సకల ప్రాణికోటికి ఆస్వాదయోగ్యమైన ఈ దివ్యసంపదను చీకటి కోణాలలో దాచిపెట్టి మహాపరాధం చేసినారు. ఏమిటి దీనివల్ల మీరు సాధించినది. పవిత్రమైన కార్యక్రమాలకు ప్రకృతిసైతం సహకరిస్తుంది. రసనదీమతల్లి నాకు తోడ్పడినది. మీ ముందు నేను నిలవడానికి మిమ్మల్ని నిలదీయడానికి నా మనోనైర్మల్యమే కారణం.''?

పణులు తెలుసుకున్నారు. సరమను సామంతో లొంగదీసుకోవాలనుకున్నారు. నయవంచకులకు యుక్తాయుక్త విచక్షణలుండవు. కార్యం సాధించుకోవడమే వాళ్ల ధ్యేయం. కరణాలతో కారణాలతో వాళ్లకు పనిలేదు.

''సరమా! నీ వెవరో మాకు తెలుసు. మేమెవరమో నీకు తెలుసు. మధ్య ఈ ఇంద్రుడెవ్వడు? అతని స్వరూపమెట్లా ఉంటుంది? ఆయన స్వభావమేమిటి? అతని ఉనికెక్కడ? ఆ ఇంద్రుని దూతగ నీ వెందుకమ్మా రావడం? అతనితో మాకేమి ఇబ్బందిలేదు. నీవొకపనిచేయి. ఆ ఇంద్రుణ్ణి ఇక్కడికి పిలుచుకొని రా. అతనితో స్నేహం చేద్దాం. ఈ గోసంపద ఎక్కడున్నా ఒక్కటే. దీనినంతా అతడే కాపలా కాయవచ్చు. వాని బాగోగులను ఇంద్రుడే చూసుకోవచ్చు. మాకు కూడ ఒక మంచి గోరక్షకుని అవసరం ఉంది.''

సరమ పణుల మాటలకు పకపక నవ్వినది. వాళ్ల అజ్ఞానానికి,

అహంకారానికి నవ్వుకొన్నది. ఇంద్రుని కేవలమొక గోపాలకునిగ చేసుకోవాలనుకొనేవాళ్ల తెగువకు ఆశ్చర్యపడినది. సరమ ప్రత్యుత్తరమిచ్చినది. అవి మాటలు కావు, వజ్రాయుధాలు.

''పణులారా మీరు అజ్ఞానులు. మీ మాటలు మీ మూర్ఖత్వాన్ని చాటుతున్నాయి. ఇంద్రుడంటే ఎవ్వరనుకున్నారు. అతడు పాలకుడేగాని పాలించబడేవాడుకాదు. మీకు అణగి మణగి ఉండే సేవకుడు కాదు. మీకు సేవలు చేసే భటుడుకాడు. సామాన్యమైన ఇంద్రదూతను నేనే. ఈ నదులుదాటి మిమ్మల్ని చేరగలిగినాను. ఈ నదులు, జలాలు ఇంద్రుని ముంచలేవు. అతని కోపాగ్నిలో దహించుకోపోకముందే గోవుల నప్పగించి లొంగిపోండి. నా హితమువింటే మీరు సన్నిహితులౌతారు. అహితులైన మీరు ఇంద్రకోపాగ్నికి ఆహుతికాక తప్పదు.''

పణులు వ్యంగ్యోక్తులకు దిగినారు. సరమను భయపెట్టతలచినారు.

''సరమా! ఇవిగో గోవులు. నీవు కోరుకొనేవి, కావాలనుకొనేవి. స్వర్గలోకంనుండి నదిని దాటించి, అంతదూరం నుండి వ్యయప్రయాసల కోర్చి మేము ఈ గోగణాన్ని ఇక్కడ చేర్చినాము. అంత తేలికగ వీనిని వదలుకోము. చేతనైతే మాతో యుద్ధం చేసి గెలిచి తీసుకొనిపోండి. మా ఆయుధాల వాడిమి, వేడిమి మీకింకా తెలిసినట్లు లేదు.''

పణుల ఉద్దేశ్యం సరమకు బోధపడింది. వివేకహీనులైన పణులను చూసి జాలిపడింది.

ఇంద్రుడు మిమ్మల్ని వదలడు :

*''పణులారా! మీరెంత అజ్ఞానులు. మీరు ఇంద్రుని సేనావాహినితో తులతూగలేరు. మీరనుకోవడం కూడ సబబే. పాపపంకిలమైన మీ దేహాలలో వరా ఆయుధాలు ప్రవేశించడానికి సంకోచింపవచ్చు. మీరున్నచోటు దండయాత్రకు అనువుకాకపోవచ్చు. అది దుర్గమమే కావచ్చు. కాని గుర్తుంచుకోండి. దేవతలకే దేవతైన మా ఇంద్రుడు మిమ్మల్ని ప్రాణాలతో వదలడు.''*

పణులు ఈ మాటలతో కొంత జంకినారు. మళ్లీ సామరస్య సంభాషణకు దిగివచ్చినారు.

*''సరమా! ఈ గోసంపద విలువ నీకు తెలియనిది కాదు. ఇది బాహాటంగ ఉండడం క్షేమం కాదు. ఈ గోవులు పర్వతాలమధ్య సురక్షితంగ ఉంటాయి. రక్షణకే మారుపేరైన రక్షకులు పణులు. మా రక్షణలో అవి ఉండడం సబబేకదా! నీవు మాత్రం అంతదూరంనుండి రావడం ఒట్టి ప్రయాస.''*

సరమ నిగ్రహమైన ఆవేశంతో సత్యాన్ని చాటింది. అనవసరప్రసంగంవల్ల కాలయాపనే. కార్యశూరులకిది రుచించదు. సరమ తేటతెల్లం చేసింది.

''మీ మాటలు కట్టిపెట్టండి. మీకు అపజయం తప్పదు. సోమపానం చేసిన అమృతమూర్తులు ఋషులు, ఆయాస్యులు, అంగిరసులు, నవగ్వులు కలిసికట్టుగ మిమ్మల్ని ముట్టడిస్తారు. మీరు దొంగిలించి దాచిపెట్టిన గోగణాన్ని వాళ్లు కైవశం చేసుకోక తప్పదు''.

పణులు సరమతో తమకున్న పాతచుట్టరికాన్ని తిరగతోడినారు. దానానికి మించిన ఉపాయం లేదు. దీనికి లొంగనివాళ్లుండరు. పణులు కలుపుగోలు వ్యవహారానికి దిగినారు.

''చూడు సరమ! ఎందుకీ వాచాలత్వం. నీవు ఇంతదూరం కష్టపడి వచ్చింది ఆ దేవతల ఒత్తిళ్లకు లొంగే కదా! మా మాటవిను. మనం మనం ఒకటి. నిన్ను మా చెల్లెలిగ స్వీకరిస్తాం. నీవంతు గోవులను నీవు తీసుకో. నీవు మాతోనే కలిసి బ్రతుకు. మళ్ళీ నీవక్కడికి పోనక్కరలేదు.''

సరమనవ్వు పెదవులను దాటలేదు. ఆర్జవము, సత్యములనే రథనేమి వర్తనయైన సరమ, పణులకు హితమును పలికినది. కర్తవ్యమును తెలిపినది. భవిష్యత్తును ప్రకటించినది. నీతిని బోధించినది.

''మీరు నెరిపే సోదర సోదరీభావాలు నాకనవసరం. మీ మాటలలో మర్మము మీకే తెలుసు. నేనేమిటో మీకు తెలుసు. ఇంద్రునికి తెలుసు. గోగణం జాడకోసం నిరీక్షించే మా వాళ్లు నన్ను చూచిన మరుక్షణమే మీమీద దండెత్తి వస్తారు. మీరు

> వాళ్లధాటికి తట్టుకోలేరు. నావమాటవిని సుదూరంగ పారిపోండి!''

ఇంకా మీనం మేషం లెక్కపెడ్తున్న పణులతో కడసారిగ హెచ్చరిస్తున్నది సరమ.

> ''ఏమిటి మీరింకా ఇక్కడే ఉన్నారు. వెంటనే పారిపోండి! మిమ్మల్ని మీరు కాపాడుకోండి. గోవులగురించి ఆలోచనలు మానండి. ఇంద్ర సోమాది ఋషులు వానిని సావకాశంగ తీసుకొనిపోతారు. వాళ్ల ధనాన్ని వాళ్లు చూసుకొంటారు.''

**అందరికీ గోక్షీరం లభించింది :**

పణుల మాయాజాలానికి చిక్కకుండ సరమ తన దౌత్యాన్ని పూర్తిచేసి ఇంద్రసదనం చేరుకొన్నది. సరమ ఋజువర్తనంతో, సత్యనిష్ఠతో, బుద్ధికౌశల్యంతో సాధించిన కార్యానికి సంతసించిన ఇంద్రుడు సరమ కోరిన వరాన్ని అనుగ్రహించినాడు. సరమ పొందిన గోక్షీరం సకల ప్రాణికోటికి ఆహారంగ ఏర్పడింది. సరమ త్యాగనిరతి, వాత్సల్యం, వరఫలం ఆచంద్రతారార్కమై నిలిచింది.

సరమ మార్గాన్ననుసరించి ఇంద్రుడు రసనుదాటి, గిరులను భేదించి గోరక్షణకు నిలచిన రక్కసుని చంపి గోవులను కైవశం చేసుకొన్నాడు. పణులు పారిపోయినారు. ఈ ఇంద్రుని జైత్రయాత్రలో అంగిరసులు, మరుత్తులు బాసటగ నిలిచినారు. అంగిరసులు చేసిన గానానికి గోవుల ఘోషలు ప్రతిధ్వనులుగ నిలిచినవి.

ఈవిజయోత్సాహంతో అంగిరసులు ఒక మహాయజ్ఞాన్ని నిర్వహించి ఇంద్రుని స్తుతించినారు. సరమను సత్కరించినారు. అందరికీ ఉదారంగా ఆవుపాలను పంచినారు.

సరమవరం వర్షించిన గోక్షీరం ఆస్వాదించి అందులో మునకలు వేయగలిగిన భాగ్యం మనకు దక్కినది.

**అది ఉషోదయం.**

**అవి భాస్కరుని కిరణాలు.**

**మానవజీవన భాగ్యరేఖలు.**

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDA PATHASALA

★ DHARMAGIRI ★

&

VEDA_AGAMA_SILPA SADAS

5-7-1999 To 8-7-1999